క్లుప్తంగా

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

మండపేట: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పశు వైద్యాధికారులు పని చేయాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కొమ్మా వెంకట్రావు సూచించారు. కోనసీమ జిల్లా స్థాయి పశుసంవర్ధక శాఖ సమీక్ష సమావేశాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ పాడి రైతులకు పశు వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. పాడి రైతు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ డాక్టర్ అంబేడ్కర్, అమలాపురం డీడీ ఇన్‌చార్జ్ విజయరెడ్డి, రామచంద్రాపురం, రాయవరం, రాజోలు, రావులపాలెం, మలికిపురం, కొత్తపేట, గన్నవరం ఏడీలు, వైద్యులు, మండపేట ఈవోపీఆర్డీ ఐదం రాజు పాల్గొన్నారు.

రేపు బండారులంకలో అరసం తొలి జిల్లా మహాసభ

కపిలేశ్వరపురం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 14న అమలాపురం రూరల్ మండలంలోని బండారులంక గ్రామంలో నిర్వహించనున్నట్టు సంఘం కన్వీనర్ గండి స్వామి ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత సంఘం మహాసభను నిర్వహిస్తున్నామని, సాహిత్యకారులు పడాల వీరభద్రరావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరు శివప్రసాద్, పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, డాక్టర్ చల్లా రవికుమార్, కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ , బొల్లినేని నాగార్జున సాగర్ హాజరవుతారన్నారు. బండారులంకలోని వీఎస్ఎం షాపింగ్‌మాల్‌లో ఉదయం 10 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని స్వామి ప్రసాద్ తెలిపారు.

పారదర్శకంగా కాంగ్రెస్ సీట్ల కేటాయింపు

మండపేట: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సీట్ల కేటాయింపులో పార్టీ అధిష్టానం పారదర్శకంగా వ్యవహరించిందని ఏఐసీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. జిల్లాలోని మూడు రిజర్వ్‌డ్ స్థానాలను మినహాయిస్తే, మిగిలిన నాలుగింటిని ఏ రాజకీయ పార్టీ గుర్తించని సామాజిక వర్గాల వారికి కాంగ్రెస్ సీట్లు కేటాయించిందన్నారు. స్థానికంగా ఉండే అభ్యర్థులకే ప్రాధాన్యం ఇచ్చామన్నారు. అయితే కొంతమంది పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని కామన తోసి పుచ్చారు. గతంలో పార్టీకి ద్రోహం చేసినవారు క్రమశిక్షణా చర్యలకు గురైన వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణం.. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రోగాల బారిన పడే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ముక్కామల వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంద్రావతి మాట్లాడుతూ వేసవిలో వడగాల్పులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

పి.గన్నవరం: ఎన్నికల్లో పాల్గొనే దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడంతో పాటు, వారికి ఉపయోగపడేలా సాక్షం యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా దివ్యాంగుల ఎన్నికల నోడల్ అధికారి బీవీ రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి దివ్యాంగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్రమబద్ధమైన ఓటరు విద్య, ఎన్నికల్లో భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, జిల్లాలో నూరు శాతం దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్లలోనే ఏర్పాటు చేసినట్టు వివరించారు. వీరి కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్షం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 85 సంవత్సరాలు దాటిన, నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన వారు, నడవలేని దివ్యాంగులు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. దివ్యాంగులకు సహాయకులుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లను నియమిస్తామని తెలిపారు. అంధులకు కూడా ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్టు రమణ వివరించారు. అనంతరం ఓటు హక్కు ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు.

కల సాకారం

- ఎట్టకేలకు జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటు
- తీరనున్న కక్షిదారులు, న్యాయవాదుల కష్టాలు



జిల్లా కోర్టు ఏర్పాటు చేయనున్న కోర్టు ప్రాంగణం

రామచంద్రపురం: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటు ఎట్టకేలకు ఫలించింది. ఎలక్షన్ కోడ్‌కు ముందు రాష్ట్ర ప్రభుత్వం రామచంద్రపురం కోర్టుల ప్రాంగణంలో అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్‌కు సంబంధించిన రికార్డులను బదిలీ చేసేందుకు సిద్ధం చేయాలని జిల్లా కోర్టు జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

తీరనున్న కక్షిదారుల కష్టాలు

రామచంద్రపురం పట్టణంలో సబార్డినేట్ కోర్టు బ్రిటిష్ పాలనలో ఏర్పాటైంది. తదనంతరం స్థానిక ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 1981లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రామచంద్రపురం, పరిసర ప్రాంతాల కక్షిదారులు కోర్టులలో తమ సమస్యలను పరిష్కరించుకునే వారు. పీడీఎం, సబ్ కోర్టులలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. రామచంద్రపురం, అనపర్తి, అలమూరు సబ్ కోర్టుల పరిధిలోని కేసులకు సంబంధించి అప్పీలును రామచంద్రపురంలో ఏర్పాటు కానున్న అదనపు జిల్లా కోర్టు సెషన్స్ బెంచ్‌లో అప్పీలు వేసుకునే అవకాశం ఉంటుంది. గతంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి రాజమహేంద్రవరం వెళ్లి, అక్కడున్న జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి వచ్చేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటు కోసం నాలుగు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు ఇన్నాళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటైంది

ఏర్పాటుకు రంగం సిద్ధం

రామచంద్రపురంలో అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయడం వల్ల 8 మండలాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది. రామచంద్రపురం పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, అనపర్తి కోర్టుల పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, ఆలమూరు మండలాల కక్షిదారులకు రాజమహేంద్రవరం జిల్లా కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ మేరకు జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా చర్యలు ముమ్మరం చేస్తున్నారు. రామచంద్రపురంలో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పరిధిలోని మండలాలకు సంబంధించిన రికార్డులను బదిలీ చేసేందుకు సిద్ధం చేయాలని జిల్లా కోర్టు జడ్జి ఉత్తర్వులను జారీ చేశారు. అతి త్వరలోనే ఎన్నో ఏళ్లుగా ఆశిస్తున్న జిల్లా కోర్టు బెంచ్ రామచంద్రపురం ప్రస్తుతం ఉన్న కోర్టుల ప్రాంగణంలో ఏర్పాటు కానుండటంతో, అటు కక్షిదారులు, ఇటు న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల కృషి ఫలించింది



కింద కోర్టులో కేసులను జిల్లా కోర్టులో అప్పీలు చేసుకునేందుకు రాజమహేంద్రవరం వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల కక్షిదారులతో పాటుగా న్యాయవాదులకు ఇబ్బందులు ఉండేవి. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటు వల్ల కక్షిదారులకు, న్యాయవాదులకు సమయం కలిసి వస్తుంది. గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా కోర్టు కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చొరవతో జిల్లా కోర్టు ఇక్కడ ఏర్పాటయింది. ఆయనకు బార్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, రామచంద్రపురం

'జగనన్న'కు అండగా.. 'తోట'న్నకు తోడుగా..

పలు గ్రామాల్లో వలంటీర్ల స్వచ్ఛంద రాజీనామా



రాయవరం మండలం వి.సావరంలో మూకుమ్మడిగా స్వచ్ఛంద రాజీనామా పత్రాలతో వలంటీర్లు

రాయవరం: వలంటీర్లుగా తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు ఈ ఎన్నికల్లో అండగా నిలిచేందుకు తాము సిద్ధమని వలంటీర్లు స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు వలంటీర్లను విధులకు దూరంగా పెట్టిన నేపథ్యంలో వారు స్వచ్ఛంద రాజీనామాకు సిద్ధపడ్డారు. పలువురు వలంటీర్లు స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామా సమర్పించారు. ఆయా పంచాయతీ కార్యదర్శులకు వారు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. మండలంలోని సోమేశ్వరం గ్రామానికి చెందిన 18 మంది, మాచవరానికి చెందిన 23 మంది, వి.సావరానికి చెందిన 15 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడి రాజీనామాలు సమర్పించారు. వారి బాటలోనే మండలంలోని పలు గ్రామాల వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం.

వైఎస్సార్ సీపీలో చేరిన కాలేరు టీడీపీ శ్రేణులు



మండపేటలో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, గంగరాజు

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు గ్రామంలో టీడీపీకి చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు గురువారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. మండపేటలోని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కాలేరు గ్రామశాఖ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఏలేటి గంగరాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. పార్టీలో చేరిన కరుపూడి వెంకటరమణ, కురుపూడి సత్తిబాబు, అనసూరి ఆంజనేయులు, గోవిందు, బుజ్జి, బోడపాటి వెంకన్న, మట్టా సురేష్, గుడాల చిన సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవకు ఆకర్షితులైనట్టు తెలిపారు.

మండపేటలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



రైస్‌మిల్లుకు వెళ్లడానికి సిద్ధంగా ధాన్యం ట్రాక్టర్

మండపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని స్థానిక వల్లూరి అప్పారావు పీఏసీఎస్ అధ్యక్షుడు పెంకే గంగాధర్ అన్నారు. శుక్రవారం నుంచి పట్టణంలో రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఈ సందర్భంగా గంగాధర్ సూచించారు. శుక్రవారం మొదటగా పట్టణానికి చెందిన రైతు పాలచర్ల రామకృష్ణ తన పంటను ఆర్బీకే వద్ద విక్రయించారు. కార్యక్రమంలో మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అడబాల బాబ్జీకి సతీ వియోగం



రామలక్ష్మి

మండపేట: మండపేట మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు, సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడబాల బాబ్జీకి సతీ వియోగం కలిగింది. ఆయన భార్య రామలక్ష్మి (45) గురువారం రాత్రి కన్ను మూశారు. కొంతకాలంగా ఆమె కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు ఆమెను విజయవాడలోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు భర్త బాబ్జీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాబ్జీ సతీమణి మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొనిశెట్టి రామాంజనేయులు, దూలం వెంకన్నబాబు, వుండమట్ల శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్ విచారం వ్యక్తం చేశారు.

ప్రచారంలో దూకుడు పెంచిన సూర్యప్రకాష్



బాలాంత్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్

కె.గంగవరం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని బాలాంత్రంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఈ ప్రభుత్వ హయాంలో సంక్షేమ లబ్ధి పొందారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు. కులం, మతం పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేన పార్టీల వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలంతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. ఆయన పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు(చినబాబు), మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దళితులంతా వైఎస్సార్ సీపీ వెంటే..



బందనపూడి ఎస్సీ పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దళిత నాయకులు

కాజులూరు: రాష్ట్రంలోని దళితులంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని ఎంపీపీ మాత భారతి అన్నారు. కాజులూరు మండల గ్రామాలకు చెందిన పలువురు ఎస్సీ సెల్ నేతలు గత కొన్ని రోజులుగా మండలంలోని పలు దళిత వాడల్లో పర్యటించి రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బాగంగా శుక్రవారం బందనపూడిలో పర్యటించారు. ఎంపీపీ మాత భారతి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అందుబాటులోకి వచ్చిన పథకాలు, జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బాబు వస్తే పథకాలు కొండెక్కుతాయి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు
- కేశవరంలో ఎన్నికల ప్రచారం



కేశవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పాపారాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: పొరపాటున రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేస్తారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, రంపచోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కర్రి పాపారాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా పాపారాయుడు శుక్రవారం మండలంలోని కేశవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన జేబుసంస్థ ద్వారా వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వృద్ధులు, వికలాంగులకు పింఛన్ల పంపిణీ విధుల నుంచి వలంటీర్లను దూరం చేశారన్నారు. ఈ నెల మొదటి వారంలో సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 మంది వృద్ధులు మరణించారని పాపారాయుడు గుర్తు చేశారు. ఈ పాపం చంద్రబాబును పట్టి పీడిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు పెదపాటి ఉమామహేశ్వరరావు, కొప్పిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ చంద్రమళ్ల పోతురాజు, గనిశెట్టి సత్తిబాబు, గండుమేను గోవిందు, చుక్కా శ్రీరాములు, అల్లంపల్లి కిషోర్, తుపాకుల ప్రసన్నకుమార్, చంద్రమళ్ల రావిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కూటమి వస్తే కొందరికే.. జగన్ గెలిస్తే అందరికీ

- సంక్షేమ పథకాలు అందుతాయి
- వైఎస్సార్ సీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ , వేగుళ్ల పట్టాభి
- 17, 19 వార్డుల్లో ఎన్నికల ప్రచారం



మండపేట 17, 19 వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మండపేట: కలగూర గంప లాంటి కూటమి పార్టీలు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొందరికే అందుతాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి అన్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కులమతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తారని వారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ శ్రేణులతో కలసి వారిద్దరూ శుక్రవారం పట్టణంలోని 17, 19 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారందరూ గడపగడపకూ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, పట్టాభి మాట్లాడుతూ నాడు- నేడు పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు అన్నింటినీ కార్పొరేట్ పాఠశాల లకంటే మిన్నగా తీర్చిదిద్దారన్నారు. పేద పిల్లలకు కూడా ఇంగ్లిషు మీడియంలో బోధన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తోట త్రిమూర్తులును ఎమ్మెల్యేగా గెలిపించాలని వారు కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు(నారయ్య బాబు,) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచారంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పార్టీ నాయకుడు చోడే శ్రీకృష్ణ, కౌన్సిలర్ మొండి భవాని, పెంకే గంగాధర్, దూలం చక్రవర్తి, మీగడ శ్రీనివాసరావు, అధికారి శ్రీను, జొన్నపల్లి సత్తిబాబు, ముక్కా దాలయ్య, సిద్దిరెడ్డి రామకృష్ణ,షేక్ అలీఖాన్‌బాబా, సాధనాల శివ, కొడమంచిలి భాస్కరరావు, టేకిముడి శ్రీనివాస్, పిఠాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు.

సంక్షేమ కాంతులు జగన్‌కే సాధ్యం



మసకపల్లిలో అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులతో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

కె.గంగవరం: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించడం కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని అగ్నికుల క్షత్రియ సంఘం నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు పెమ్మాడి మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని వాసాలరేవు, కోటిపల్లి, బ్రహ్మపురి, మసకపల్లి గ్రామాల్లోని అగ్నికుల క్షత్రియ సంఘాలను శుక్రవారం ఆయన కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి మేలు జరిగిందన్నారు. మత్స్యకార భరోసా ద్వారా ఆదుకోవడంతో పాటు పలు పథకాలు అమలు చేసి మత్స్యకార కుటుంబాలను ఆదుకున్నారని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్ పోటీ చేస్తున్నారని ఆయనకు అగ్నికుల క్షత్రియ సంఘాలన్నీ ఏకమై మద్దతు తెలిపి విజయం సాధించే వరకు ఆయన వెన్నంటే ఉండాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రతిపక్ష పార్టీలు గతంలో ఎన్నో హామీలు ఇచ్చారని ఏ ఒక్కటి అమలు చేయలేదని ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు.

ఓటే బలమైన ఆయుధం

సఖినేటిపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని ఎంపీడీవో పీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మోరిపోడు, సఖినేటిపల్లి శాంతి నగర్‌లో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటు విలువ తెలుసుకో, భవిష్యత్తును కాపాడుకో అంటూ పై ర్యాలీల్లో నినదించారు. ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అగస్టీన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫలితాలు నిరాశాజనకం.. మార్కులు ఆశాజనకం

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాలు నిరాశాజనకంగానే ఉన్నప్పటికీ విద్యార్థులు సాధించిన మార్కులు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి. ఈ కళాశాల ఫస్టియర్ ఉత్తీర్ణత 40 శాతం ఉండగా సెకండియర్ ఉత్తీర్ణత 45 శాతంగా ఉంది. ఫస్టియర్‌లో 43 మందికి 17 మంది ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 20 మందికి 9 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థి పి.కార్తీక్ 470 మార్కులకు 451 సాధించగా, ఎం.అమృత వర్షిణి 447 మార్కులు సాధించింది. ఫస్టియర్ సీఈసీ విద్యార్థిని కె.చండీప్రియ 500 మార్కులకు 462 మార్కులు సాధించింది. ఫస్టియర్ బైపీసీ విద్యార్థిని ఎం.నందిని 440 మార్కులకు 355 మార్కులు సాధించింది. సెకండియర్ బైపీసీ విద్యార్థిని ఎస్ఎస్ఎస్ పూజిత 1000 మార్కులకు 771 మార్కులు సాధించింది. అలాగే ఎంపీసీ విద్యార్థిని ఎ.జ్యోతిశ్రీ 684 మార్కులు పొందింది. మెరుగైన ప్రతిభ కనిపించిన విద్యార్థులను ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు అభినందించారు.



పిడతల జశ్విన్



టి. బిందుశ్రీ

గురుకుల కళాశాల విద్యార్థికి బైపీసీలో 955 మార్కులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల బాలుర కళాశాల విద్యార్థి పిడతల జశ్విన్ బైపీసీలో 1000 మార్కులకు గాను 955 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ నాగేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. అదే విధంగా సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 24 మందికి 16 మంది, బైపీసీలో 15 మందికి 14 మంది, సీఈసీలో 9 మందికి 8 మంది ఉత్తీర్ణులయ్యి మొత్తం సీనియర్ ఇంటర్‌లో 79.16 శాతం, జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 19 మందికి 15 మంది, బైపీసీలో 25 మందికి 15 మంది, సీఈసీలో 6 గురికి 4 గురు ఉత్తీర్ణులై జూనియర్ ఇంటర్‌లో 68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. బైపీసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి జశ్విన్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందించారు.

కాజులూరులో 51 శాతం ఉతీర్ణత

కాజులూరు: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 51 శాతం ఉతీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు తమ కళాశాల నుంచి ఈ ఏడాది 117 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది విద్యార్థులు విజయం సాధించారన్నారు. ఇందులో 974 మార్కులతో ఎంపీసీ విద్యార్థిని కేతా వేణు కళాశాల ప్రథమ స్థానంలో నిలువగా, 947 మార్కులతో ఎంపీసీ విద్యార్థిని టి.బిందుశ్రీ ద్వితీయ స్థానంలోనూ, 943 మార్కులతో ఎంపీసీ విద్యార్థిని పి.కుసుమ తృతీయ స్థానంలోనూ విజయం సాధించారన్నారు.